క్లుప్తంగా

'ఆటో' ఇటో అయితే..!



ఫిరంగిపురం: మండలంలోని పలుగ్రామాల్లో పరిమితికి మించి వాహనాల్లో ప్రయాణికులను తీసుకెళుతున్నారు. ప్రమాదమని తెలిసినా తప్పక ప్రయాణిస్తున్నారు. దీంతో పలుప్రమాదాలు సంభవిస్తున్నాయి. పరిమితికి మించి ఉండటం, డ్రైవర్ సీటుకు ఇరువైపులాకూడా ప్రయాణికులను ఎక్కించుకుంటుండటంతో వెనుకనుంచి వచ్చే వాహనాలు కన్పించక పలు ప్రమాదాలు సంభవించి మృత్యువాతపడిన వారు కొందరైతే, క్షతగాత్రులైనవారు మరికొందరున్నారు. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు స్పందించి తనిఖీలు నిర్వహించి ప్రమాదాలు తగ్గేందుకు కృషిచేయాలని ప్రజలు కోరుతున్నారు.

నేతన్నల సమస్యలు పరిష్కరించాలి



తాడేపల్లిరూరల్: చేనేత ఐక్య కార్యాచరణ కమిటీ ఆధ్వర్యంలో జూన్ 19న రాష్ట్రంలో అన్ని కలెక్టరేట్ల వద్ద ధర్నా నిర్వహించి కలెక్టర్‌లకు మెమోరాండం ఇవ్వాలని చేనేత ఐక్య కార్యాచరణ కమిటీ నాయకుడు పిల్లలమర్రి నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. సోమవారం మంగళగిరిలోని వేములపల్లి శ్రీకృష్ణ భవన్‌లో నిర్వహించిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చేనేతల న్యాయమైన డిమాండ్ల సాధన కోసం అన్ని కలెక్టర్ కార్యాలయాల వద్ద జూన్ 19న ధర్నా నిర్వహించి కలెక్టర్లకు మెమోరాండం ఇవ్వాలని అన్నారు. ఈ కార్యక్రమానికి అధిక సంఖ్యలో చేనేత కార్మికులు తరలి రావాలని కోరారు. కమిటీ నాయకులు రామనాథం పూర్ణచంద్రరావు, పిల్లలమర్రి బాలకృష్ణ, కూరపాటి కోటేశ్వరరావు, దొడ్డి ఈశ్వరరావు, డోకిపర్తి రామారావు, మల్లేశ్వరరావు పాల్గొన్నారు.

డోగిపర్రు ఎస్సీ కాలనీలో జిల్లా మలేరియా అధికారి పర్యటన



మేడికొండూరు: మండలంలోని డోగిపర్రు ఎస్సీకాలనీ అంబేద్కర్ నగర్‌లో విష జ్వరాలు విజృంభిస్తున్నాయి. పలువురికి మలేరియా పాజిటివ్ నిర్ధారణ అయినట్లు వైద్య అధికారులు తెలిపారు. సోమవారం ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు చేసి, ఇంటింటికి తిరిగి రక్త పరీక్షలు చేశారు. ఈ నేపథ్యంలో జిల్లా మలేరియా అధికారి సుబ్బరాయణం కాలనీలో పరిసరాలు పరిశీలించి ఆరోగ్య సిబ్బందికి సూచనలు చేశారు. జ్వరం లక్షణాలు ఉన్న ప్రతి ఒక్కరికీ మందులు పంపిణీ చేశారు. పంచాయతీ అధికారులు పారిశుద్ధ్య చర్యలు చేపట్టారు. సబ్ యూనిట్ అధికారి ఘంటసాల శ్రీనివాసరావు, ఆరోగ్య పరిరక్షణ అధికారి శ్రీనివాసరావు, మేడికొండూరు సీహెచ్‌ఓ రామారావు, కె.దాసు, పలువురు ఆరోగ్య శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

అంకితభావంతో పనిచేసే వారికి గుర్తింపు



తాడికొండ: విధి నిర్వహణలో అంకిత భావంతో పనిచేసిన వారికి గుర్తింపు ఉంటుందని తాడికొండ తహసీల్దారు జి.వి.ఎస్.ఫణీంద్ర బాబు అన్నారు. తాడికొండలో ఆర్‌ఐగా పని చేస్తూ డీఎస్‌ఓ కార్యాలయానికి బదిలీ అయిన ఎ.కోటేశ్వరరావు, ఎన్నికల సీనియర్ అసిస్టెంట్ అనిల్‌కుమార్‌ను సోమవారం ఘనంగా సత్కరించారు. పలువురు రెవెన్యూ సిబ్బంది వీరి సేవలను కొనియాడారు. కార్యక్రమంలో డెప్యూటీ తహసీల్దారు కాకుమాను ప్రసాద్, మండల సర్వేయర్ బాబూరావు, వీఆర్‌ఓలు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

తోపుడు బండ్లు అందజేత

తాడేపల్లిరూరల్: వడ్డేశ్వరంలో అద్దెబండ్లపై వ్యాపారం చేసుకునే చిరు వ్యాపారులకు మంగళగిరి ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడి ఆర్థిక సహకారంతో సోమవారం తోపుడు బండ్లు అందజేశారు. వైఎస్సార్ సీపీ బీసీ సెల్ జిల్లా నాయకులు కత్తిక రాఘవరావు, కత్తిక మల్లికార్జునరావు (బుల్లబ్బాయి) తోపుడు బండ్లను అందజేశారు. గొడవర్తి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన విద్యతోనే భవిష్యత్తు



విద్యార్థినికి జగనన్న విద్యాకానుక కిట్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే ఆర్కే, ఎమ్మెల్సీ హనుమంతరావు

- విద్య, వైద్య రంగాల్లో పెనుమార్పులు తీసుకొచ్చిన సీఎం వైఎస్ జగన్
- మంగళగిరి ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే)
- విద్యార్థులకు జగనన్న విద్యాకానుక కిట్లు అందజేత

తాడేపల్లిరూరల్: దోచుకోలేనిది, దాచుకోలేనిది విద్య ఒక్కటేనని, రాష్ట్రంలో ఉన్నటువంటి పేద కుటుంబాల్లో మార్పు రావాలంటే అది విద్యతోనే సాధ్యమవుతుందని ఆనాడు దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి ఫీజు రీయింబర్స్‌మెంట్ ఏర్పాటు చేసి ఎంతో మంది పేద విద్యార్థులు ఉన్నత విద్య చదివేందుకు తోడ్పడ్డారని, నేడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రైమరీ నుంచి విద్యార్థుల్లో ప్రతిభను బయటకు తీసేందుకు నిధులు కేటాయించి ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలనూ తీర్చిదిద్దారని మంగళగిరి శాసనసభ్యుడు ఆళ్ల రామకృష్ణారెడ్డి అన్నారు. సోమవారం దుగ్గిరాల మండల పరిధిలోని రేవేంద్రపాడు జిల్లా పరిషత్ పాఠశాలలో జగనన్న విద్యాదీవెన కింద విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు, బ్యాగ్‌లు, షూ ఇతర సామగ్రిని ఎమ్మెల్యే ఆర్కే, ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, ఆప్కో చైర్మన్ గంజి చిరంజీవితో కలసి అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో కార్పొరేట్ పాఠశాలలకు దోచిపెట్టేందుకు ప్రభుత్వ పాఠశాలలను నిర్లక్ష్యం చేశారని, ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి అధికారం చేపట్టిన తరువాత ప్రభుత్వ పాఠశాలలను నాడు–నేడు కింద అభివృద్ధి చేయడంతో పాటు కొత్త భవనాలు నిర్మించారని, పాఠశాల ప్రారంభం రోజు విద్యార్థులకు అవసరమైన పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలతో పాటు యూనిఫారం, అందజేస్తున్నారన్నారు. ప్రతి ఒక్క విద్యార్థి పాఠశాలకు రావాలని పనులకు పంపించకూడదనే ఉద్దేశంతో తల్లుల ఖాతాలో అమ్మఒడి పేరుతో రూ.15 వేలు నగదును జమచేస్తున్నారన్నారు. చిన్నారులు ఆరోగ్యంగా ఉండేందుక పౌష్టికాహారాన్ని అందజేస్తున్నారని అన్నారు. బాబా సాహెబ్ డాక్టర్ అంబేడ్కర్ అన్న విధంగా అందరికీ విద్య అనే నినాదంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ముందుకు వెళుతూ ఆయన ఆశయాలను అమలు చేస్తున్నారన్నారు. ఈ నాలుగేళ్ల కాలంలో సుమారు 43 లక్షల మంది విద్యార్థులకు రూ.60,500 కోట్ల నిధులు ఖర్చు చేసి విద్యలో పెను మార్పులు తీసుకు వచ్చారని, దీని ఫలితం రాబోయే 10 సంవత్సరాల్లో మనం చూస్తాం అని అన్నారు. దుగ్గిరాల మండలంలో జగనన్న విద్యాకానుక కింద నాల్గవ విడతలో 4,651 మంది విద్యార్థులకు రూ1.20 కోట్ల వ్యయంతో పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు, యూనిఫామ్, బ్యాగ్‌లు, ఇతర స్టేషనరీ అందజేశారని అన్నారు. ఎంపీపీ దానబోయిన సంతోషరూపవాణి, జడ్పీటీసీ మేకతోటి అరుణ, మార్కెట్ యార్డ్ చైర్మన్ షేక్ బాజీ, రేవేంద్రపాడు సర్పంచ్ పణుకూరి మేరమ్మ, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, వైఎస్సార్ సీపీ నాయకులు, ఉపాధ్యాయులు, విద్యాకమిటీ వైస్ చైర్మన్, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



నులకపేట జెడ్పీ ఉర్దూ పాఠశాలలో కిట్లు అందజేస్తున్న వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ వేణుగోపాల స్వామిరెడ్డి



పెనుమాకలో విద్యాదీవెన కిట్లను అందజేస్తున్న నాయకులు, పేరెంట్స్ కమిటీ సభ్యులు

జగనన్న విద్యా కానుక కిట్ల పంపిణీ..

తాడేపల్లిరూరల్: తాడేపల్లి పట్టణ పరిధిలోని నులకపేటలో వున్న ఉర్దూ జిల్లా పరిషత్ పాఠశాలలో జగనన్న విద్యాదీవెన కింద కిట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ బుర్రముక్కు వేణుగోపాల స్వామిరెడ్డి అతిథిగా హాజరై విద్యార్థులకు జగనన్న విద్యాకానుకను అందజేశారు. పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఈదులమూడి డేవిడ్ రాజు, పేరెంట్స్ కమిటీ చైర్మన్ జిలాని తదితరులు పాల్గొన్నారు. తాడేపల్లి కళ్ళం వెంకటరెడ్డి ప్రభుత్వ పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు బి.తాతిరెడ్డి విద్యాకానుక కిట్లు అందజేశారు. పేరెంట్స్ కమిటీ చైర్‌పర్సన్ బి. శ్రీలక్ష్మి, కమిటీ మెంబర్స్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. వడ్డేశ్వరం జిల్లా పరిషత్ ఉన్న పాఠశాలలో వైఎస్సార్ సీపీ బీసీ సెల్ నాయకుడు కత్తిక రాఘవరావు ఆధ్వర్యంలో విద్యాకానుక కిట్లు అందజేశారు. హెచ్‌ఎం జి.సుబ్బారావు గొడవర్తి శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్ రంగా షరీఫ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. పెనుమాక జిల్లా పరిషత్ పాఠశాలలో విద్యాకమిటీ చైర్మన్ ఎస్కే సుభాని విద్యార్థులకు కిట్లను అందజేశారు. వైఎస్సార్ సీపీ నాయకులు మేకా దామేష్‌రెడ్డి, భుజంగరావు, బొక్కా నాని, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సామాజిక సేవా కార్యక్రమాల నిర్వహణ అభినందనీయం

తాడేపల్లిరూరల్: కార్పొరేట్ సంస్థలు సామాజిక స్పృహతో సేవ చేయాలని ఎమ్మెల్యే ఆర్కే అన్నారు. సోమవారం దుగ్గిరాలలో బకింగ్ హామ్ కెనాల్ కాలువపై ఫుట్ బ్రిడ్జి నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆర్కే మాట్లాడుతూ మంచికలపూడిలో ఉన్న కాంటినెంటల్ కాఫీ కంపెనీవారు సామాజిక స్పృహతో దుగ్గిరాల ప్రభుత్వ పాఠశాలలకు, ఇతర ప్రభుత్వ కార్యాలయాలకు ప్రజలు వెళ్లేందుకు కాలువపై ఫుట్ బ్రిడ్జి నిర్మిస్తున్నారని వారికి దుగ్గిరాల ప్రజల తరఫున అభినందనలు తెలియజేస్తున్నామని అన్నారు. ఈ ఫుట్ బ్రిడ్జి త్వరలోనే ప్రజలకు అందుబాటులోకి వస్తుందని ఈ నిర్మాణం వల్ల ఎంతోమంది విద్యార్థులు, ప్రజలు దుగ్గిరాల గ్రామంలోకి రావడానికి ఉపయోగపడుతుందని ఆయన అన్నారు. ఇరిగేషన్ డీఈ ఎన్‌కేవీ ప్రసాద్, ఏఈ వనిత, వైఎస్సార్ సీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

47 క్వింటాళ్ల రేషన్ బియ్యం స్వాధీనం

తాడికొండ: 47 క్వింటాళ్ల అక్రమంగా నిల్వ ఉన్న రేషన్ బియ్యాన్ని వలపన్ని పట్టుకున్న ఘటన తుళ్లూరు మండలం రాయపూడిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం చంద్రశేఖర్ అనే వ్యక్తి 47 క్వింటాళ్ల రేషన్ బియ్యంను ఓ ఇంటి ఆవరణలో వర్షం పడుతుందని నిల్వ ఉంచుకుంటామని వృద్ధురాలిని నమ్మించి నిల్వ ఉంచాడు. ఉదయాన్నే తిరిగి తీసుకెళ్లేందుకు ప్రయత్నిస్తుండగా, తుళ్లూరు సీఐ శేషగిరిరావు ఆధ్వర్యంలో రెవెన్యూ అధికారులు దాడులు చేసి రేషన్ బియ్యం స్వాధీనం చేసుకుని, నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

వైభవంగా రాజగోపుర శంకుస్థాపన



శంకుస్థాపనకు ముందు పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, ఎమ్మెల్యే ఆర్కే

తాడేపల్లిరూరల్: గుంటూరు జిల్లా దుగ్గిరాల మండల పరిధిలోని కంఠంరాజు కొండూరులోని వేంచేసియున్న మహంకాళి అమ్మవారి దేవస్థానం ప్రాంగణంలో సోమవారం రాజగోపుర నిర్మాణం కోసం దేవదాయ శాఖ ఆధ్వర్యంలో శంకుస్థాపన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాజీ మంత్రి, ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, శాసనసభ్యుడు ఆళ్ల రామకృష్ణారెడ్డి విచ్చేశారు. వీరి రాకను పురస్కరించుకుని ఆలయ ఈఓ చినవెంకటరెడ్డి పూర్ణకుంభాభిషేకంతో ఘనస్వాగతం పలికారు. అనంతరం రాజగోపురానికి శంకుస్థాపన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆర్కే మాట్లాడుతూ దేవదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ సహకారంతో సీజీఎస్ నిధులనుంచి రాజగోపుర నిర్మాణం కోసం రూ.కోటి మంజూరు చేయడమైందని, అంతేకాకుండా కృష్ణాజిల్లాకు చెందిన కృష్ణారెడ్డి, పుల్లారెడ్డిలు ముందుకు రావడం శుభపరిణామమని అన్నారు. 5 అంతస్తుల రాజగోపురాన్ని నిర్మించడంతో పాటు దేవాలయంలో వున్న మూలవిరాట్టును కదలించకుండా గర్భగుడిని పూరిగా రాతితో నిర్మించడం, 50 అడుగుల ఎత్తు కల్గిన 5 అంతస్తుల రాజగోపురాన్ని 9 నెలల వ్యవధిలో పూర్తిచేయడానికి అన్ని ఏర్పాటు జరిగాయని అన్నారు. గర్భగుడి నిర్మాణం ఆగస్టు 31 నాటికి పూర్తిచేసేందుకు కార్యాచరణ రూపొందించి అందుకు అనుగుణంగా నిర్మాణ పనులు జరుగుతాయని అన్నారు. ఆప్కో చైర్మన్ గంజి చిరంజీవి, ఎంపీపీ దానబోయిన సంతోష రూపవాణి, దుగ్గిరాల మార్కెట్ యార్డు చైర్మన్ షేక్ బాజీ, ఎంపీటీసీ షేక్ సుభాని, వైఎస్సార్ సీపీ బీసీ సెల్‌జిల్లా అధ్యక్షులు దానబోయిన వెంకటేశ్వరరావు, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వైఎస్సార్ సీపీ నాయకులు ఉన్నం రాజేష్, మైనేని రవీంద్రబాబు, కొరిటాల సురేష్, నూతలపాటి కేశవరావు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీలోనే పేదలకు భరోసా

- రాష్ట్రవ్యాప్తంగా పెత్తందార్లకు పేదలకు మధ్య యుద్ధం
- అధికారంలో ఉన్నప్పుడు ఒక మాట అధికారంలో లేనపుడు ఒక మాట చెప్పం
- ఎన్ని అవాంతరాలు వచ్చినా ఇళ్లు నిర్మిస్తాం
- స్పష్టం చేసిన ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే)



పెదవడ్లపూడికి చెందిన ఇళ్లు లేని పేదలకు పట్టాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ఆర్కే

తాడేపల్లిరూరల్: ప్రజలకు ఇచ్చిన హామీలన్నిటినీ నెరవేర్చిన ఘనత దేశంలోనే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమే దక్కుతుందని మంగళగిరి శాసనసభ్యుడు ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే) అన్నారు. సోమవారం నవులూరు లే అవుట్‌లో మంగళగిరి రూరల్ పరిధిలోని పెదవడ్లపూడికి చెందిన ఇళ్లులేని నిరుపేద అక్కా చెల్లెమ్మలకు ఇళ్లస్థలాలు కేటాయించి పట్టాలు అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి.. ఆప్కో చైర్మన్ గంజి చిరంజీవి, మంగళగిరి తహసీల్దార్ రామ్‌ప్రసాద్, కార్పొరేషన్ టౌన్ ప్లానింగ్ ఏసీడీ వెంకటరెడ్డితో కలసి ఇళ్లపట్టాల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆర్కే మాట్లాడుతూ మంగళగిరి తాడేపల్లి కార్పొరేషన్ వ్యాప్తంగా 98 శాతం అక్కాచెల్లెమ్మలకు ఇప్పటికే ఇళ్లస్థలాలు కేటాయించాం. అర్హులై ఇళ్లస్థలాలు రాని వారికి సైతం మరో నాలుగు నెలల్లో ఇళ్లస్థలాలు కేటాయిస్తాం అని అన్నారు. ప్రజలు ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డికి అండదండగా ఉండి మరోసారి ఆయన్ను ముఖ్యమంత్రిని చేసుకుని పేదప్రజలకు పట్టాభిషేకం చేద్దామన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ స్థానిక నాయకులు, సచివాలయ సిబ్బంది, యానిమేటర్లు, డ్వాక్రా మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

65 ఏళ్లనాటి కల ఇది!



నాకు 65 సంవత్సరాల తర్వాత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పుణ్యమా అంటూ నా పేరుమీద ఆస్తి ఉండడమే కాకుండా సొంత ఇల్లు కట్టుకునే అవకాశం లభించింది. సొంత ఇంటి కోసం, స్థలం కోసం ఎంతోమంది నాయకుల చుట్టూ ఎన్నోసార్లు తిరిగా. వలంటీర్లు మా ఇంటికి వచ్చి నన్ను గుర్తించి నాకు స్థలం కేటాయించి పట్టా అందజేశారు. నాకు ఎంతో ఆనందంగా ఉంది.

– అక్కినేని సరోజని

తోబుట్టువుకు జగనన్న ఇచ్చిన ఆస్తి



ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి నిరుపేదలైన అక్కాచెల్లెమ్మలను తోబుట్టువులా భావించి లక్షల విలువ చేసే స్థలాలను అందజేశారు. మొట్టమొదటగా నా పేరు మీద కూడా సొంత ఆస్తి ఉంది. ఈ స్థలంలో ఇల్లు నిర్మించుకుని మా పిల్లలను చక్కగా చదివించుకుంటాం. ఎవరు ఎన్ని చెప్పినా జగనన్నే మళ్లీ సీఎం అవుతారు.

– వినుగు నాగలక్ష్మి

పేకాట రాయుళ్లు అరెస్టు

తాడేపల్లి రూరల్: తాడేపల్లి రూరల్ పరిధిలోని కొలనుకొండలో సోమవారం రాత్రి గుట్టుచప్పుడు కాకుండా ఓ నివాసంలో పేకాట ఆడుతున్న వారిని ఎస్‌బీ సీఐ మారయ్య అదుపులోకి తీసుకున్నారు. సీఐ మారయ్య తెలిపిన వివరాల ప్రకారం కొలనుకొండ శివారులో ఓ నివాసంలో 15మంది పేకాట ఆడుతున్నట్లు సమాచారంతో సిబ్బందితో దాడి చేశామని, దాడుల్లో పేకాట ఆడుతున్న వారివద్ద నుంచి రూ. 60వేలు నగదు స్వాధీనం చేసుకుని పోలీసులకు అప్పగించినట్లు తెలిపారు.

పేదింటి విద్యకు పెద్దపీట



జగనన్న విద్యా కానుక కిట్లు పంపిణీ చేస్తున్న వైఎస్సార్ సీపీ సమన్వయకర్త కత్తెర సురేష్ కుమార్

- సీఎం వైఎస్ జగన్ సర్కారు దేశానికే ఆదర్శం
- జగనన్న విద్యాకానుక కిట్ల పంపిణీలో సమన్వయకర్త కత్తెర సురేష్ కుమార్



వడ్డమానులో విద్యా కానుక కిట్లు పంపిణీ చేస్తున్న బుర్రా వెంకట శివారెడ్డి, సొసైటీ చైర్మన్ చుండు వెంకటరెడ్డి



విద్యార్థులకు కిట్లు అందజేస్తున్న జెడ్పీటీసీ కత్తిరేణమ్మ, ఎంపీపీ షహేలా నర్గీస్

పొన్నెకల్లు(తాడికొండ): రాష్ట్రంలో ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాబోధన జరుగుతూ నాణ్యమైన ఫలితాలు సాధిస్తుండటం ప్రభుత్వ పారదర్శక పాలనకు నిదర్శనమని వైఎస్సార్ సీపీ తాడికొండ నియోజకవర్గ సమన్వయకర్త కత్తెర సురేష్ కుమార్ అన్నారు. సోమవారం తాడికొండ మండలం పొన్నెకల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ఉర్దూ పాఠశాలలో విద్యార్థులకు జగనన్న విద్యాకానుక కిట్లు పంపిణీ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యతోనే అభివృద్ధి అని నమ్మిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో ప్రతి పేదవాడికి విద్యను చేరువ చేసేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటూ దేశంలోనే రాష్ట్రాన్ని ఆదర్శ రాష్ట్రంగా నిలుపుతున్నారనడంలో సందేహం లేదన్నారు. పేదరికం లేని సమాజ నిర్మాణమే లక్ష్యంగా రాష్ట్రంలో జగనన్న పాలన కొనసాగుతుందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిష్ మీడియం విద్యను ప్రవేశ పెట్టడం ద్వారా కార్పొరేట్‌కు దీటుగా నేడు విద్యార్థులు ఫలితాలు సాధిస్తున్నారని గుర్తుచేశారు. గత ప్రభుత్వ పాలనలో కార్పొరేట్ వ్యవస్థతో కుమ్మక్కైన చంద్రబాబు ప్రభుత్వ పాఠశాలలను నిర్లక్ష్యం చేసి, విద్యను పూర్తిగా నిర్వీర్యం చేసే దశకు తీసుకొచ్చి పేదలకు అందని ద్రాక్షగా చేశాడని మండిపడ్డారు. జడ్పీ హైస్కూల్ అభివృద్ధికి తనవంతు సాయం అందిస్తానని ఈ సందర్భంగా ఆయన హామీ ఇచ్చారు. పలువురు ప్రజా ప్రతినిధులు, అధికారులతో కలిసి విద్యార్థులకు జగనన్న విద్యా కానుక కిట్లు పంపిణీ చేశారు. సర్పంచ్ నూకతోటి మేరిమ్మ, ఎంపీటీసీ నూతక్కి మరియమ్మ, స్థానిక నాయకులు పప్పుల సీతారామిరెడ్డి, ఎంపీడీఓ అత్తోట దీప్తి, హెచ్‌ఎం షేక్ జరీనా బేగం, ఎస్.రాజ్‌కుమార్, చింతల భాగ్యారావు, చింతల భాగ్యారావు, తాడిబోయిన శివన్నారాయణ, పలువురు గ్రామస్తులు, నాయకులు పాల్గొన్నారు.

రాయపూడిలో...

రాయపూడి(తాడికొండ): విద్యా కానుక కోసం ప్రభుత్వం ఇతర రాష్ట్రాల కంటే నాలుగు రెట్లు అధికంగా పెద్ద ఎత్తున నిధులు ఖర్చు పెడుతుందని మాజీ ఎంపీపీ మల్లెల హరీంద్రనాద్ చౌదరి అన్నారు. తుళ్ళూరు మెయిన్ పాఠశాలలో విద్యార్థులకు జగనన్న విద్యా కానుక కిట్లు పంపిణీకి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఎంఈఓ కోటేశ్వరరావుతో కలిసి విద్యార్థులకు జగనన్న విద్యాకానుక కిట్లు పంపిణీ చేశారు. హెచ్‌ఎం వల్లభాపురపు ప్రసాద్, కాంప్లెక్స్ హెచ్‌ఎం కె.శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు. తుళ్ళూరు మండలం వడ్డమాను గ్రామంలోని ఆర్‌సీఎం ప్రాథమిక పాఠశాల, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో వైఎస్సార్ సీపీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ బుర్రా వెంకట శివారెడ్డి, సొసైటీ మాజీ అధ్యక్షుడు చుండు వెంకటరెడ్డి, శ్రీనివాసరెడ్డిలు జగనన్న విద్యాకానుక కిట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఫిరంగిపురంలో...

ఫిరంగిపురం: విద్యాభివృద్ధికోసం రాష్ట్రప్రభుత్వం ఎంతో కృషి చేస్తున్నట్లు జెడ్పీటీసీ సభ్యురాలు దాసరి కత్తిరేణమ్మ అన్నారు. మండలకేంద్రంలోని సెయింట్‌ఆన్స్ తెలుగు మీడియం పాఠశాలలో సోమవారం జగనన్న విద్యాదీవెన కిట్లు పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈకార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా జెడ్పీటీసీ సభ్యురాలు దాసరి కత్తిరేణమ్మ, ఎంపీపీ షేక్ షహేలా నర్గీస్‌లు పాల్గొన్నారు. కత్తిరేణమ్మ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యాభివృద్ధికోసం అనేక పథకాలు ప్రవేశపెట్టి పేద,బడుగు, బలహీన వర్గాల విద్యా ఉన్నతికి ఎంతో కృషిచేస్తున్నట్లు తెలిపారు. అనంతరం విద్యార్థులకు జగనన్న విద్యాదీవెన కిట్లు అందజేశారు. నాయకులు కె.చిన్నప్పరెడ్డి, అప్పిరెడ్డి, సిస్టర్ థెరసమ్మ, ఉపాధ్యాయుడు ఇన్నారెడ్డిలు పాల్గొన్నారు. అదేవిధంగా గరుడాచలపాలెంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో జగనన్న విద్యాకానుక కిట్లను ఉప సర్పంచ్ కె.వెంకట్రావు పంపిణీచేశారు. హెచ్‌ఎం వై.సాంబశివరావు, సులేమాన్, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు. నుదురుపాడు మండలపరిషత్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు పాఠశాల విద్యాకమిటీ చైర్మన్ జనాబ్ మస్తాన్‌వలి జగనన్న విద్యాదీవెన కిట్లను అందజేశారు. హెచ్‌ఎం లక్ష్మి, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ కార్యాలయంలో సంబరాలు



తాడేపల్లి క్రిస్టియన్ పేటలో కేక్ కట్ చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు

తాడేపల్లిరూరల్: మంగళగిరి శాసనసభ్యుడు ఆళ్ల రామకృష్ణారెడ్డి రెండవసారి ప్రమాణ స్వీకారం చేసి సోమవారం నాటికి నాలుగు సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా తాడేపల్లి క్రిస్టియన్ పేట వైఎస్సార్ సీపీ కార్యాలయంలో నాయకులు విజయోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణ కన్వీనర్ బుర్రముక్కు వేణుగోపాల స్వామిరెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నేతృత్వంలో మంగళగిరి శాసనసభ్యుడు ఆళ్ల రామకృష్ణారెడ్డి నియోజకవర్గాన్ని ఎంతో అభివృద్ధి చేస్తున్నారని, మూడవ సారి కూడా ఎమ్మెల్యేగా ఆళ్ల రామకృష్ణారెడ్డి విజయం సాధిస్తారని, నియోజకవర్గంలో ఎన్నడూ జరగని అభివృద్ధి ఎమ్మెల్యే ఆర్కే హయాంలో జరిగిందన్నారు. అనంతరం కేట్ కట్ చేశారు. పార్టీ ఎస్టీ సెల్ అధ్యక్షులు మేడా వెంకటేశ్వరావు, మేకా వెంకట రామిరెడ్డి, ఎస్టీ సెల్ ప్రధాన కార్యదర్శి చిన్నపోతుల దుర్గారావు, తాడేపల్లి పట్టణ ఎస్సీ, బీసీ, రైతు, మహిళా అధ్యక్షులు ముదిగొండ ప్రకాష్, బత్తుల దాస్, బందావు రుగ్మాంగరెడ్డి, సంపూర్ణ పార్వతి, మాజీ కౌన్సిలర్ వేముల లక్ష్మి రోజా, కురగంటి ఉదయరాజు, అంబారావు, బత్తుల వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

బాల కార్మిక వ్యవస్థకు పేదరికమే ప్రధాన కారణం

తుళ్లూరు ఎంపీడీఓ బి.శివన్నారాయణ



వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఎంపీడీఓ బి.శివన్నారాయణ

తాడికొండ: బాలకార్మిక వ్యవస్థకు ప్రధాన కారణం పేదరికమేనని తుళ్లూరు ఎంపీడీఓ బి.శివన్నారాయణ అన్నారు. ప్రపంచ బాల కార్మిక వ్యతిరేక దినోత్సవం సందర్భంగా మంగళగిరి గుడ్ షెపర్డ్ కాన్వెంట్ ఆధ్వర్యంలో ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించిన అవగాహన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. పేదరిక నిర్మూలనకు ప్రభుత్వం చేస్తున్న కృషితో పాటు స్వచ్ఛంద సంస్థల సహకారం అవసరం ఎంతైనా ఉందన్నారు. బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు బాలలు, మహిళల హక్కులు, రక్షణ తదితర అంశాలపై అవగాహన కల్పిస్తున్న గుడ్ షెపర్డ్ కాన్వెంట్ నిర్వాహకులను అభినందించారు. ఏపీఎం చిన వీరయ్య, శ్రీనిధి బ్యాంక్ డీజీఎం ఎం.హృదయ రాజు మాట్లాడుతూ పేదరిక నిర్మూలనకు విద్య దోహదం చేస్తుందని, బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనకు నిరంతరం పనిచేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ సందర్భంగా అతిథులతో కలిసి వాల్‌పోస్టర్లు ఆవిష్కరించారు. గుడ్ షెపర్డ్ కాన్వెంట్ సిస్టర్, ప్రాజెక్ట్ డైరెక్టర్ ఆఫ్ హ్యూమన్ రైట్స్ ప్రతినిధి లత, ఈవోపీఆర్డీ నాగానంద్, ఎస్ఐ రాంబాబు, మారుతి మహిళా సొసైటీ డైరెక్టర్ బి.గిరిజ, ఐసీడీఎస్ సెక్టార్ సూపర్ వైజర్ సునీత, కార్స్ సంస్థ సెక్రటరీ దాములూరి పోతురాజు, వీఆర్‌ఓలు, గుడ్ షెపర్డ్ కాన్వెంట్ సిస్టర్‌లు, సిబ్బంది పాల్గొన్నారు.

తపాల జీవిత బీమా పాలసీల పునరుద్ధరణకు అవకాశం

తెనాలి: ల్యాప్స్ అయిన తపాల జీవిత బీమా/ గ్రామీణ తపాల జీవిత బీమా పాలసీలను తిరిగి పునరుద్ధరించుకునే అవకాశాన్ని భారతీయ తపాల శాఖ కల్పించినట్టు ఆ శాఖ తెనాలి సూపరింటెండెంట్ యు.యల్లమందయ్య చెప్పారు. స్థానిక కొత్తపేటలోని ప్రధాన తపాల కార్యాలయంలో సోమవారం రివైవల్ మేళాను నిర్వహించారు. ఈ మేళాలో యల్లమందయ్య మాట్లాడుతూ తపాలశాఖ 150ఏళ్లుగా తపాల జీవిత బీమా/ గ్రామీణ తపాల జీవితబీమా పాలసీలతో ఎన్నో కుటుంబాలకు బీమా రక్షణ కల్పిస్తోందని చెప్పారు. ఈ నేపథ్యంలో కస్టమర్ల కోసం కొత్తగా మంచి ఆఫర్‌ను ప్రకటించినట్టు తెలిపారు. ప్రీమియం చెల్లించలేక ఆగిపోయిన పాలసీలను లాప్స్ అయిన పాలసీలుగా పరిగణించి, వాటికి బీమా రక్షణ వర్తించదని గుర్తుచేశారు. ఇలాంటి పాలసీలకు తిరిగి ప్రీమియం చెల్లించడంద్వారా అన్నివిధాలుగా రక్షణను కల్పిస్తూ, ప్రీమియం చెల్లించిన పూర్తికాలానికి బోనస్‌నుకూడా చేరుస్తామన్నారు. బీమా పాలసీల పునరుద్ధరణకు చెల్లించాల్సిన డిఫాల్ట్ ఫీజులో 25నుంచి 30శాతం వరకు రాయితీని తపాలశాఖ ప్రకటించిందని చెప్పారు. ఈనెల ఒకట తేదీనుంచి ఆగస్టు 31వ తేదీవరకు ఈ రాయితీ అమలులో ఉంటుందని చెబుతూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇదే సమావేశంలో ఇటీవల ఆకస్మికంగా మృతిచెందిన పెదగాదెలవర్రుకు చెందిన ఎం.మురళి కుటుంబానికి బీమా క్లెయిమ్ మంజూరు కాపీని ఆయన అందజేశారు.